సాక్షి తిరుపతి

శనివారం । 28 । జూన్ । 2025



బదిలీలు.. తమ్ముళ్లకు కాసులు

సచివాలయ ఉద్యోగుల బదిలీలు కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్నాయనే విమర్శలు గుప్పుమంటున్నాయి. - 8లో



శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపది ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించారు. - 8లో



పచ్చనేతల దౌర్జన్యం

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు టీడీపీ నేతలు యత్నించడాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఆర్టీసీ అభివృద్ధికి కృషి



డీపీటీవోగా బాధ్యతలు స్వీకరించిన జగదీష్

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి డీపీటీవోగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి డీపీటీవోగా పనిచేస్తున్న వెంకట్రావ్ విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ కావడంతో చిత్తూరు డీపీటీవోగా పనిచేస్తున్న జగదీష్‌ను తిరుపతికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరేళ్లుగా రాబడిలో తిరుపతి జిల్లా మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. ప్రయాణికుల అవసరాలను బట్టి బస్సుల సర్దుబాటు ఉంటుందని తెలిపారు. ప్రయాణికులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 193 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా తిరుపతి కేటీ.రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం 1,04,001వ ర్యాంకు నుంచి లక్షా 20 వేలు ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలనను నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ 193 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా చివరి రోజైన శనివారం 1,20,001వ ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలలు, కోర్సులను ఎంపిక చేసుకోవాలని కోరారు.

కల్కి ట్రస్టు భూమిపూజపై ఫిర్యాదు



తహసీల్దారు శ్రీదేవితో మాట్లాడుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని తలారివెట్టు గ్రామ రెవెన్యూలోని ప్రభుత్వ ఇంటి స్థలాల లే అవుట్‌లో కల్కి ట్రస్టు దాసాజీలు శుక్రవారం పూజలు చేయడంపై తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామస్తులు తహసీల్దారు శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తలారివెట్టు రెవెన్యూలో ప్రభుత్వం 6 ఎకరాల 50 సెంట్ల భూమి ఇంటి స్థలాలు లేని వారికి ఇవ్వాలని ప్రభుత్వం రైతుల నుంచి భూసేకరణ పథకంలో కొనుగోలు చేసిందన్నారు. ప్రభుత్వ లే అవుట్‌లో ఎవ్వరికీ పట్టాలు ఇవ్వలేదని, అయితే కల్కి దాసాజీలు లే అవుట్‌లో ఇంటి నిర్మాణాల కోసం భూమి పూజలు చేయడం దారుణమని తెలిపారు. లే అవుట్ పక్కన కల్కి ట్రస్టుకు సంబంధించి 200 ఎకరాల భూమి ఉందని, భూమి విలువను పెంచుకోవడానికి దాసాజీలు ఇలాంటి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వ లే అవుట్‌లోకి ఎలా ప్రవేశిస్తారని ప్రశ్నించారు. తలారివెట్టు, కల్లివెట్టు, వేణుగోపాలపురం, గ్రామాల్లో ఇంటి స్థలాలు లేనివారు 200 మందికి పైగా ఉన్నారని వీరందరికి తలారివెట్టు గ్రామ రెవెన్యూలోని లే అవుట్‌లో స్థలాలు ఇవ్వాలని కోరారు. దీనిపై తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ.. విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సులభ రీతిలో బోధించాలి



మాట్లాడుతున్న జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ : విద్యార్థులకు సులభ రీతిలో పాఠాలు బోధించాలని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గౌరీశంకర్ రావు తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడు కండ్రిగ, నెలవాయి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను పరిశీలించి మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు , యూనిఫాం , బ్యాగ్‌లు అందించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీఎం శ్రీ పాఠశాలకు సంబంధించిన కెమిస్ట్రీ ల్యాబ్, బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులు, కిచెన్ గార్డెన్ వేసిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు. బుచ్చినాయుడుకండ్రిగలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, హరిప్రియ పాల్గొన్నారు.

మోసాల మేనిఫెస్టోపై నిలదీద్దాం

- చంద్రబాబు మోసాలను ఎండగడదాం
- ఏడాది కాలంగా ప్రజలను వంచిస్తున్న ప్రభుత్వం
- వందల హామీలను గుప్పించి తుంగలో తొక్కేశారు
- ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన దేవుడు జగనన్న
- కూటమి పాలనపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమన్వయకర్తలు



డిజిటల్ స్క్రీన్‌లో చంద్రబాబు మేనిఫెస్టోను, జగనన్న సందేశాన్ని వీక్షిస్తున్న పార్టీ నేతలు

తిరుపతి మంగళం : అధికారం కోసం నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పిన కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుదామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్‌ను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణ స్వామి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, కృపాలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మేనిఫెస్టోను స్క్రీన్ ద్వారా పార్టీ నేతలకు వివరించారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలను వివరిస్తూ జిల్లా, నియోజకవర్గ, మండల, పంచాయతీ, గ్రామ స్థాయి వరకు చంద్రబాబు మేనిఫెస్టోను తీసుకెళ్లి కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు.



రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో స్కానర్‌ను సెల్‌ఫోన్ల ద్వారా స్కాన్ చేసుకుంటున్న పార్టీ నేతలు

మోసగించడం చంద్రబాబు నైజం



ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో గత ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాలకంటే ఎక్కువే ఇస్తానంటూ నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి నమ్మిన వాళ్లను మోసగించడం చంద్రబాబు నైజం. ఎన్నికల్లో ఇచ్చిన ‘సూపర్‌సిక్స్’ హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చావా? బాబూ. అధికారంలోకి రాగానే ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు 1500 ఇస్తానన్నావ్, 50 ఏళ్లకే పెన్షన్ అన్నావ్, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అన్నావ్, మహిళలకు ఉచిత బస్సు అన్నావ్, లక్షల ఉద్యోగాలు అన్నావ్, రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నావ్ ఇలా చెప్పుకుంటూ పోతే వందల అబద్ధపు హామీలు గుప్పి ప్రజలను మోసగించావు. వీటితో పాటు తల్లికి వందనం పేరుతో కొంతమంది తల్లుల ఖాతాల్లో డబ్బులు వేసి లక్షల మంది తల్లులను వంచించావు. ఇలా చెప్పిన అబద్ధాన్నే పదిసార్లు చెప్పి ప్రజలను మోసగించడం తమ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి తెలియదన్నారు. ఇప్పటికే చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలంతా గ్రహిస్తున్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి నాయకులను నిలదీసేలా చేద్దాం.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్

జగనన్న పాలనలోనే సంక్షేమం



అధికారం కోసం ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం. మాట కోసం కట్టుబడి ఇచ్చిన హామీల కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన గొప్ప నాయకుడు జగనన్న. ఐదేళ్ల జగనన్న పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎక్కడా సంక్షేమ పథకాలను ఆపలేదు. ప్రతి పేదవాడికి సంక్షేమాన్ని అందించి పేదల గుండెల్లో జగనన్న దేవుడయ్యారు. అధికారం కోసం నోటికి వచ్చిన అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళుతాం.

– కళత్తూరు నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం



సమావేశంలో పాల్గొన్న జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నాయకులు

ఏడాది కాలంగా వంచనే



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయకుండా ప్రజలను వంచిస్తూనే ఉన్నారు. అధికారంలోకి రావడం కోసం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మేనిఫెస్టో బాండ్లపై సంతకాలు చేసి మరీ ప్రజలకు ఇచ్చారు. అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయక పోగా అనేక ఆంక్షలు విధించి లక్షల మంది లబ్ధిదారులను తొలగించారు. తల్లికి వందనం పేరుతో లక్షల మంది తల్లులకు ఎగనామం పెట్టారు. ఉద్యోగాలు లేవు, నిరుద్యోగ భృతి లేదు. ఆడబిడ్డ నిధి లేదు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించడం తప్ప ఏ ఒక్క హామీని నెరవేర్చిన పాపానపోలేదు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షపూరిత రాజకీయాలకు చంద్రబాబు, పవన్‌కళ్యాన్, లోకేష్ పాల్పడుతున్నారు. అయినా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి వెంట వస్తున్న జన సంద్రాన్ని చూసి కూటమి నాయకుల గుండెల్లో దడ పుడుతోంది. అందుకే జగనన్నను ఎక్కడికక్కడ నిలువరించాలని చూస్తున్నారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి మోసాలను ఎండగడుదాం. అందుకు ప్రతి నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ నేతలు కంకణబద్ధులు కావాలి.

– భూమన కరుణాకరరెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

కూటమి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తాం



గత ఎన్నికల్లో కూటమి నాయకుల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మోసాలను ఎండగడుదాం. ప్రజలను వంచించి మోసగించిన ప్రజాద్రోహులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోవడంతో యువత భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. లోకేష్‌కు మంత్రి పదవి, నాగబాబుకు ఎమ్మెల్సీ ఇవ్వడంలో ఉన్న ఆసక్తి యువతకు ఉద్యోగాలు , నిరుద్యోగ భృతి ఇవ్వడంలో శ్రద్ధ చూపడం లేదు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షపూరిత రాజకీయాలు చేయడం తప్ప ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు. చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతాం.

మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్జీ రంగా వర్సిటీ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి

తిరుపతి సిటీ : వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా పరిశోధనలు జరగాలని ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ‘వ్యవసాయంలో సవాళ్లు, వాతావరణ అనుకూలత, నూతన ఆవిష్కరణలు’ అనే అంశాలపై రెండు రోజులపాటు జరగనున్న జాతీయ సదస్సును ఆమె వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం అతిథులతో కలసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సమస్యలను కనుగొని రైతుల ఆదాయాన్ని పెంచడానికి దోహదపడతాయన్నారు. అనంతరం బెంగళూరుకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ పూర్వ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎంఏ శంకర్ మాట్లాడుతూ.. నూతన వంగడాల దిగుబడి సామర్థ్యం పెంపొందించడానికి పంట యాజమాన్య పద్ధతులు కీలకమన్నారు. రాష్ట్ర రైతు సాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా గణనీయమైన పురోగతి సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ రాజిరెడ్డి, డైరెక్టరేట్ ఆఫ్ వీడ్ రీసెర్చ్ జబల్పూర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ఎన్జీరంగా వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సుమతి, ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రానమీ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ వైస్ చైర్మన్ డాక్టర్ భరతలక్ష్మి, ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాకు ఆదర్శం కావాలి

- వెబ్ ల్యాండ్, మ్యుటేషన్‌లు త్వరితగతిన పరిష్కరించండి
- రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జయలక్ష్మి



ప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని వెళుతున్న కమిషనర్ జయలక్ష్మి

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరం జిల్లాకు ఆదర్శం కావాలని రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జయలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం ఆమె తిరుపతి అర్బన్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెబ్‌ల్యాండ్ ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ సమస్యలతో పాటు రెవెన్యూ పరిధిలోని అన్ని అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆదేశించారు. పుత్తూరు మండలంలోని మూడు గ్రామాలకు సంబంధించి ముగ్గురు వ్యక్తుల వెబ్ ల్యాండ్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఇదే తరహాలో అన్ని సమస్యలకు పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. సాంకేతిక అంశాలపై రెవెన్యూ ఉద్యోగులు ముందుగా పట్టుసాధించాలని సూచించారు. తిరుపతి జిల్లా కేంద్రమైన అర్బన్‌లో రెవెన్యూ సమస్యలు లేకుండా చూడాల్సి ఉందన్నారు. జిల్లా కేంద్రం ఆదర్శంగా ఉంటే అన్ని మండలాలు అదే బాటలో నడుస్తాయని చెప్పారు. తిరుపతి అర్బన్ తహశీల్దార్ సురేష్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ కిరణ్, పుత్తూరు మండల తహశీల్దార్ జీసీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్ అశోక్‌రెడ్డి, పలువురు వీఆర్వోలు ఉన్నారు.

చెవిరెడ్డి అక్రమ అరెస్టుపై ఆందోళన

- నల్ల జెండాలతో నిరసన .. రోడ్డుపై బైఠాయింపు



ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు

రామచంద్రాపురం : చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం రోడ్డెక్కారు. చెవిరెడ్డి కుటుంబంపై రాజకీయ కక్ష తగదు అంటూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన తెలిపారు. రామచంద్రాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పచ్చికాపల్లం, తిరుపతి రహదారిపై కొంత సేపు బైఠాయించి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఖండించారు. ఈ సందర్భంగా అర్సీపురం మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బ్రహ్మానందారెడ్డి, జడ్పీటీసీ రాణితో పాటు పలువురు నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నులిమేస్తూ అక్రమ కేసులు పెడుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం చూపుతూ ప్రత్యర్థులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. చెవిరెడ్డిని అక్రమ కేసుల నుంచి తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చెవిరెడ్డి కుటుంబానికి అండగా నిలబడుతాం

చెవిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేసుకున్న కూటమి ప్రభుత్వంపై పోరాటానికి తామంతా సిద్ధంగా ఉన్నామంటూ చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నేతలు ముందుకు వచ్చారు. చెవిరెడ్డి జైలు నుంచి బయటకు వచ్చే వరకు తమ పోరాటాలు ఆపేది లేదని స్పష్టం చేశారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గంలోని పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం , తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు.

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం

కోట : కోటకు చెందిన ముకేష్ కుమార్ అనే యువకుడు మూడు రోజులుగా కనిపించడం లేదని అతని తండ్రి గీసూలాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన గీసూ లాల్ కోటలో టీ దుకాణం నడుతున్నాడు. తండ్రి మందలించడంతో 18 ఏళ్ల ముకేష్‌కుమార్ కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా కనిపించకుండా పోయిన ముకేష్ కుమార్ ముంబయిలో ఉన్నట్లు ఆచూకీ లభించిందని రాజస్థాన్ వాసులు తెలిపారు. ఈ విషయమై ఎస్ఐకు సమాచారం ఇచ్చామన్నారు.

ఆవుల దాడి ఘటనపై ఆందోళన వద్దు

తిరుపతి తుడా : తిరుపతిలో ఆవులు దాడి చేసినట్లు అందులో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోందని, ఈ ఘటన తిరుపతిలో చోటుచేసుకున్నది కాదని నగర ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వీడియోను తిరుపతికి చెందిన కొందరు ముందు జాగ్రత్త కోసం కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఆందోళన కలిగించే ప్రచారం మంచిది కాదని హితవు పలికారు. నగరంలో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఆమె సూచించినట్లు తెలిపారు. తిరుపతికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తున్న తరుణంలో వ్యక్తిగతంగా పశువులు పెంచుకునే వారు ఇష్టం వచ్చినట్లు రోడ్లపై వదిలి వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈవీఎం గోదాములపై నిఘా



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట : జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్ర పరిచిన గోడౌన్ వద్ద నిరంతర నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లో భద్ర పరిచిన ఈవీఎంలను శుక్రవారం రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలను అక్కడి భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి, ఎస్డీసీ సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు పచ్చనేతల దౌర్జన్యం

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి మంగళం /తిరుపతి అర్బన్ : తిరుపతి నగర, శివారు ప్రాంతాల్లో భూములు ధరలు ఆకాశానంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, పరంబోకు స్థలాలు కనిపిస్తే పచ్చనేతలు పాగవేసేస్తున్నారు.అందులో భాగంగానే మంగళం తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్, బొమ్మల క్వార్టర్స్‌లోని చెన్నాయగుంట లెక్క దాఖలాలు 195, 226 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు టీడీపీ నేతలు కొందరు శుక్రవారం ప్రయత్నించారు. ఏకంగా జేసీబీలతో గాడులు తీసి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. అర్బన్ తహశీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో ప్రసాద్ అక్రమ నిర్మాణాలను అడ్డుకుని జేసీబీలను అక్కడ నుంచి పంపివేశారు. 195, 226 సర్వే నంబర్లలోని స్థలం ప్రభుత్వానికి చెందిందని, అందులో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో టీడీపీ నాయకులు తమకు చంద్రగిరి ఎమ్మెల్యే నాని చెప్పారని, తమ వద్ద పట్టాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే మీ వద్ద ఉన్న పత్రాలను తహశీల్దార్‌కు చూపించి అనుమతి తీసుకుని నిర్మాణాలు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. అంత వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించి అక్కడ నుంచి పంపించి వేశారు.

ప్రభుత్వ బడులకు శ్రీసిటీ చేయూత

- రూ.18 లక్షలతో వసతుల కల్పన



సూళ్లూరుపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో అదనపు మరుగుదొడ్ల ప్రారంభోత్సవం

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమ ఐసాన్ ఆటో పార్ట్స్ ఇండియా సుమారు రూ.18.80 లక్షలతో వివిధ ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేసిన వసతులను ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకావే, శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ విద్యా వసతుల్లో సూళ్లూరుపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో రూ. 6.50 లక్షల ఖర్చుతో అదనపు మరుగుదొడ్లు, వంట గది నిర్మాణం, సత్యవేడు మండలం రామచంద్రపురంలో రూ.12.30 లక్షల వ్యయంతో నూతన అంగన్‌వాడీ భవనం నిర్మించారు. ఈ సందర్భంగా ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ యసనోరి సకాయి మాట్లాడుతూ.. విద్యా వసతుల కోసం సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టడం ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసాన్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ యాచి టొమిట, హెచ్ఆర్ జనరల్ మేనేజర్ గోపాల్, ప్రొడక్షన్ కోఆర్డినేటర్ తోషిహిరో సనా, మ్యానుఫ్యాక్చరింగ్ డీజీఎం దేవనాథన్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.



రామచంద్రపురంలో అంగన్‌వాడీ భవనం ప్రారంభోత్సవం

వడ్డీ వ్యాపారి నుంచి ఆటో ఇప్పించండి

చంద్రగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తమకు అందించిన ఆటోను వడ్డీ వ్యాపారి బలవంతంగా తీసుకున్నాడని, ఆయన ఆగడాల నుంచి రక్షించి, కుటుంబానికి జీవనాధారమైన ఆటోను తమకు ఇప్పించాలంటూ బాధితులు శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల వివరాల మేరకు.. మండల పరిధిలోని శేషాపురానికి చెందిన శివ భార్య నందినికి ఎస్సీ కార్పొరేషన్‌తో పాటు మహిళా సంఘాల ద్వారా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ-ఆటోను పొందారు. అప్పటి నుంచి నందిని భర్త శివ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఏ.రంగంపేటకు చెందిన పచ్చిపాల చైతన్య గతేడాది రూ.60 వేలను అప్పుగా తీసుకున్నాడు. ఆపై వడ్డీల రూపంలో సుమారు రూ.1.60 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. అయితే కొంత వడ్డీతో పాటు అసలు చెల్లించడంలో జాప్యం జరిగిందన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమకు జీవనాధారమైన ఆటోను బలవంతంగా తీసుకున్నట్లుగా బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేయాలంటూ వారు శుక్రవారం చంద్రగిరి పోలీసులను ఆశ్రయించారు.



బాధితురాలి భర్త శివ

బదిలీలు.. తమ్ముళ్లకు కాసులు

సచివాలయ బదిలీల్లో కూటమి సిఫార్సులు

రేణిగుంట : పనిచేస్తున్న మండలంలోనే ఉండేందుకు సచివాలయ ఉద్యోగులు తెలుగు తమ్ముళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా సిఫార్సులు చేయడానికి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయానికి సంబంధించి రేషలైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బదిలీల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు మండలంలోనే పోస్టింగ్ తెచ్చుకోవాలని తెలుగు తమ్ముళ్లను ఆశ్రయించారు. ప్రతి పంచాయతీలో తెలుగు తమ్ముళ్లు సిఫార్సు చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ల జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. ఆ జాబితా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏ పంచాయతీ నుంచి ఎక్కడికి మారుతున్నారు? ఎవరు రెకమెండ్ చేస్తున్నారు అనేది స్పష్టంగా ఆ జాబితాలో ఉండటంతో అందరూ అవాక్కవుతున్నారు. డబ్బులు ఎంతైనా ఇస్తామని అడిగిన చోట పోస్టింగ్ ఇవ్వండని మండల స్థాయి నాయకుల ద్వారా ఎమ్మెల్యేతో సిఫారసు చేయించుకుంటున్నారు. సొంత మండలం బూచిగా చెప్పి డబ్బులు దోచుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో బదిలీలు

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల జాబితా ఆన్‌లైన్‌లో ఉన్నాయి. రాజకీయ నాయకుల సిఫార్సుల విషయం నా దృష్టికి రాలేదు. సొంత మండలంలో ఎటువంటి పరిస్థితుల్లో పోస్టింగ్ ఇవ్వడం జరగదు.

– ప్రభురావు, ఇన్‌చార్జి ఎంపీడీవో రేణిగుంట

విద్యుత్ బస్సుల కేటాయింపు వరం: ఈడీ

- త్వరలో జిల్లాకు 50 విద్యుత్ బస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న హైదరాబాద్ బృందం

తిరుపతి అర్బన్ : తిరుపతికి విద్యుత్ బస్సుల కేటాయింపు ఓ వరంగా భావించాల్సి ఉందని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈడీ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతిలోని డీపీటీవో కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా హైదరాబాద్ నుంచి వచ్చిన విజ్ఞానజ్యోతి ఆటోమొబైల్ ఇంజినీరింగ్ వారు విద్యుత్ బస్సుల శిక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఈడీ మాట్లాడుతూ.. 2021లో జిల్లాలో 100 విద్యుత్ బస్సులను కేటాయించిన అంశాన్ని గుర్తుచేశారు. విద్యుత్ బస్సులు ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉన్నాయని. కాలుష్య నియంత్రణకు దోహదపడుతాయని పేర్కొన్నారు. అలాగే జిల్లాకు త్వరలో మరో 50 విద్యుత్ బస్సులు రానున్నాయని చెప్పారు. ఈ కొత్త సర్వీసులను మంగళం డిపో కేంద్రంగా నిర్వహించాల్సి ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీటీవో జగదీష్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

తిరుమల బ్రహ్మోత్సవాలకు సిద్ధంకండి

రానున్న తిరుమల బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ ఈడీ తిమ్మాడి చెంగల్ రెడ్డి తెలిపారు.శుక్రవారం ఆయన డీపీటీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు సందర్భంగా తిరుమలకు నడుపుతున్న సర్వీసులను ముందుస్తు ప్రణాళిక ప్రకారం తనిఖీలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీటీవో జగదీష్, డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ బాలాజీ, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, అసిస్టెంట్ ఇంజినీర్ మహేంద్ర పాల్గొన్నారు.

కార్యదర్శుల పనితీరుపై ఆగ్రహం



కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీఓ సుశీలాదేవి

బుచ్చినాయుడుకండ్రిగ : గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్యదర్శులు పనితీరు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారిణి సుశీలాదేవి హెచ్చరించారు. శుక్రవారం కారణి గ్రామంలో పర్యటించి, ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో దోమల నివారణకు మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయించి, వీధుల్లో బ్లీచింగ్ చేయించాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, తాగునీటి సమస్యలు లేకుండా, వీధులలో గుంతలు ఉంటే పూడ్చాలని తెలిపారు. అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టకపోతే ఉపేక్షించేదేలేదన్నారు. ఈక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, సర్పంచ్ పద్మమ్మ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

- భక్తులకు స్వల్పగాయాలు



ప్రమాదానికి గురైన మహిళ

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఓ కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో ముందు వెళుతున్న మరో కారును ఢీకొనడంతో భక్తులు గాయపడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. తమిళనాడుకు చెందిన భక్తులు ఓ కారులో, తెలంగాణకు చెందిన భక్తులు మరో కారులో తిరుమల నుంచి తిరుపతికి మొదటి ఘాట్ రోడ్డు మీదుగా బయలుదేరారు. ఈ నేపథ్యంలో మొదటి ఘాట్ రోడ్డులోని రెండో మలుపు వద్ద తమిళనాడు కారు అదుపు తప్పి ముందు వెళుతున్న తెలంగాణ కారును ఢీకొంది. దీంతో కారు ముందు ఉన్న రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలలోని భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. తమిళనాడుకు చెందిన భక్తుల కారు బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

పాఠశాలకు తాళం వేసి నిరసన



పాఠశాలకు అడ్డంగా ముళ్లకంప వేసిన గ్రామస్తులు



పాఠశాలకు తాళం వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం వేడాం పంచాయతీ ఎస్టీ కాలనీలో ఉన్న పాఠశాలను విలీనం చేయవద్దని గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు తాళం వేసి దారికి అడ్డంగా ముళ్లకంప వేశారు. మా బడి మాకే కావాలంటూ గ్రామస్తులు నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. అధికారులు స్పందించకుంటే గ్రామం మొత్తం వచ్చి నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

తిరుపతి అర్బన్ : హాస్టల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిద్దామని బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో హాస్టల్ వార్డన్స్‌తో పాటు సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ వైపు విద్యార్థుల చదువుకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజన వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రధానంగా విద్యార్థులకు తాగునీటి నేపథ్యంలో వేడి నీరు అందుబాటులో ఉంచడం, వేడిగా ఆహారాన్ని వడ్డించడం, మెడికల్ కిట్ నిర్వహణ, ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేపట్టడం, నాణ్యమైన సరుకులతో వంటకాలు చేయడం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారులు జ్యోత్స్న, మునేంద్ర పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి.

రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్



శిరీష

సైదాపురం : అక్రమ మైనింగ్‌దారులతో తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలంటూ రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శిరీష యాదవ్ జిల్లా పోలీసు ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. సైదాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు తాము ఫిర్యాదు చేశామన్నారు. దీని దృష్టిలో ఉంచుకోని జిల్లా మైనింగ్ అధికారులతో పాటు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న కొందరు తమపై తప్పుడు కేసులతో పాటు ప్రాణహాని కలిగించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అక్రమ మైనింగ్ చేసే వారి వల్ల తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను ఆమె కోరారు. జిల్లా ఎస్పీకి పత్రికా ముఖంగా విన్నవించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఏపీ టూరిజానికి భూ కేటాయింపు

- ఎస్వీపురం పరిధిలో 12.70 ఎకరాలకు ఆమోదం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : టూరిజం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను అభివృద్ధి చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి జిల్లాలో ఏపీ టూరిజం అథారిటీకి ఉచితంగా భూమి కేటాయింపునకు నిర్ణయం తీసుకుంది. వడమాలపేట మండలం ఎస్వీపురం పంచాయతీ పరిధిలో 12.70 ఎకరాల భూమిని అప్పగించేందుకు ఆమోద ముద్ర వేసింది. ఉచితంగా భూ కేటాయింపు ప్రతిపాదనపై మంత్రి వర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎస్వీపురం సర్వే నంబరు 428–2లో 30 సెంట్లు అలాగే సర్వే నంబరు 428–3లో 12.40 ఎకరాల చొప్పున ఏపీ టూరిజం అథారిటీకి భూమిని బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తిరుపతిలో 5 స్టార్ హోటల్ నిర్మాణానికి ముందుకొచ్చిన మెస్సర్స్ పావని హోటల్స్ సంస్థకు అవసరమైన రాయితీ ఇచ్చేందుకు చేసిన ప్రతిపాదనలపై మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ 5 స్టార్ హోటల్ ఏర్పాటుతో సుమారు 250 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు పర్యాటక రంగ శాఖ అధికార యంత్రాంగం భావిస్తోంది. అదే విధంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

పరిశ్రమల అభివృద్ధి ఉద్యోగాల కల్పనకు కృషి



వేదికపై మంత్రితోపాటు ప్రముఖులు

తిరుపతి అర్బన్ : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి సాంకేతిక అంశాలను జోడించాలని రాష్ట్ర ఎంఎస్ఎం, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. తిరుపతిలోని తాజ్ హోటల్‌లో శుక్రవారం ప్రపంచ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్పీ సోమనాథ్, రాష్ట్ర ఎంఎస్ఎం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌రావు, కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ సీఈఓ విశ్వ, తిరుపతి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం హాజరయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1.80 లక్షల మంది ఎంఎస్ఎంఈల రంగంపై ఆధారపడి ఉన్నారని చెప్పారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న వేదపండితులు



ధ్వజారోహణంలో అధికారులు, భక్తులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపతీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంకురార్పణతో పూజలు ప్రారంభం అయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమ పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు చేశారు. కాగా ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి పుర ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, శ్రీకాళహస్తి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.